
సాక్షి
తూర్పుగోదావరి
మంగళవారం ၊ 26 ၊ డిసెంబర్ ၊ 2023



హరికి దాసులై... సంస్కృతికి సారథులై...

ధనుర్మాసం రానే వచ్చింది.. తెలుగువారి పండగలకు ఆహ్వానం పలికింది.. దీనికి ప్రతీకగా గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలైంది.. - 8లో▸



11 వేల క్యూసెక్కులు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి డెల్టా కాలువలకు సోమవారం తూర్పు డెల్టాకు 3,400, మధ్య డెల్టాకు 1,600, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కులు వదిలారు.

అన్నదాన భవనానికి రూ.5 లక్షల విరాళం



ఆత్రేయపురం: వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వకుళమాత అన్నదాన భవన నిర్మాణానికి రుద్రరాజు గజపతి కుమార్ రాజు, రుక్మిణీ దేవి(పశ్చిమ గోదావరి) సోమవారం రూ.5లక్షలు విరాళం అందినట్లు ఆలయ కమిటీ చైర్మన్ రమేష్ రాజు, ఈఓ సత్యనారాయణరాజు తెలిపారు.

న్యూస్‌రీల్

డీఆర్‌డీఏ వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్‌గా మూర్తి



రాజమహేంద్రవరం రూరల్: జిల్లా డీఆర్‌డీఏ వైఎస్సార్ క్రాంతిపథం ప్రాజెక్టు డైరెక్టర్‌గా ఎన్‌వీవీఎస్ మూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకూ రాజమహేంద్రవరం డీఎల్‌డీవో వీణాదేవి ఇన్‌చార్జి పీడీగా వ్యవహరించారు. 2007 గ్రూప్–1 బ్యాచ్‌కు చెందిన మూర్తి కడియం, కోరుకొండ,రాజానగరం తదితర మండలాల్లో ఎంపీడీవోగా పనిచేశారు. ప్రస్తుతం జిల్లా పరిషత్ అకౌంట్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు ప్రభుత్వం ఇటీవల డీఎల్‌డీవో ప్రమోషన్ ఇచ్చింది. తాజాగా డీఆర్‌డీఏ వైకేపీ పీడీగా నియమించింది. కాగా కలెక్టర్ కె. మాధవీలతను మూర్తి మర్యాదపూర్వకంగా కలిశారు.

సత్యదేవుని సన్నిధికి పోటెత్తిన భక్తులు



స్వామివారి వ్రతాలాచరిస్తున్న భక్తులు

అన్నవరం: పర్వదినాలు, వరుస సెలవులతో రత్నగిరి సత్యదేవుని ఆలయం భక్తులతో కిటకిటలాడుతోంది. శనివారం ముక్కోటి ఏకాదశి పర్వదినం. ఆదివారం క్రిస్మస్ సందర్భంగా సోమవారం సెలవులు వచ్చిన విషయం తెలిసిందే. ముక్కోటి సందర్భంగా శనివారం సుమారు 50 వేల మంది, ఆదివారం సుమారు 40 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. సోమవారం సుమారు 50 వేల మంది భక్తులు సత్యదేవుడిని దర్శించుకున్నారు. భారీగా భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం, వ్రతమండపాలు, విశ్రాంతి మండపాలు అన్నీ భక్తులతో కిక్కిరిసిపోయాయి.

తెల్లవారుజామునుంచే దర్శనం

సుమారు 40 రోజల విరామం అనంతరం సోమవారం సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, శంకరులకు ముత్యాల కవచాల అలంకారం (ముత్తంగి) చేశారు. ఈ విధమైన ఆభరణాలు లేకుండా ముత్యాల వస్త్రాల అలంకారంలో స్వామి, అమ్మవారు, శంకరులను భక్తులు దర్శించి తరించారు. రాత్రి వరకు ఈ ఆలంకారం ఉంచారు. ఆదివారం రాత్రి నుంచి వేల సంఖ్యలో భక్తులు స్వామివారి ఆలయానికి తరలి వచ్చారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని సత్యదేవుని ఆలయాన్ని సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు తెరిచారు. ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఐదు గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం 5 గంటల నుంచి వ్రతాలు ప్రారంభించారు. సాయంత్రం వరకు భక్తులతో స్వామివారి ఆలయం రద్దీగా కనిపించింది. ప్రదక్షిణ దర్శనానికి గంట, సాధారణ దర్శనానికి రెండు గంటలు సమయం పట్టింది. స్వామివారి వ్రతాలాచరించే భక్తులతో వ్రత మండపాలు నిండిపోవడంతో నిత్యకల్యాణ మండపంలో కూడా వ్రతాలు నిర్వహించారు. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి పూజలు చేశారు. భక్తులకు నిత్యఅన్నప్రసాద పథకంలో ఐదు వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ రామచంద్రమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. భక్తుల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షలు ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. స్వామివారి వ్రతాలు 3,500 జరిగాయి.


రారండోయ్.. ఆడేద్దాం

- గ్రామీణ క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం
- ఆడుదాం–ఆంధ్రా పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- నేటి నుంచి ప్రారంభం కానున్న ఆటల పోటీలు
- వివిధ స్థాయిల్లో నిర్వహణకు రంగం సిద్ధం
- జిల్లాలో 2 లక్షల మంది క్రీడాకారుల నమోదు



ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారులు





సాక్షి, రాజమహేంద్రవరం: గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. క్రీడాకారుల్లో పోటీ తత్వాన్ని పెంపొందించే దిశగా ప్రణాళికలు రూపొందించింది. ఆడుదాం ఆంధ్రా పేరుతో ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం నుంచి ఫిబ్రవరి 10వ తేదీ వరకు వీటిని ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహించేందుకు సన్నద్ధమైంది. టోర్నమెంటుకు అవసరమైన క్రీడా సామగ్రిని ఆయా మండల కేంద్రాలకు పంపిణీ చేసింది. జిల్లా వ్యాప్త కార్యక్రమం రామహేంద్రవరం ఆర్ట్స్ కళాశాలలో నిర్వహించనున్నారు. కలెక్టర్ కె.మాధవీలత, ప్రజా ప్రతినిధులు పాల్గొని క్రీడా పోటీలు ప్రారంభించనున్నారు. ఇందుకు అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశారు.

క్రీడాకారుల నమోదుకు భారీ స్పందన

క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు జిల్లా వ్యాప్తంగా క్రీడాకారుల నమోదుకు భారీ స్పందన లభించింది. పాల్గొనే క్రీడాకారులకు గత నెల 27వ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ అవకాశం ఇచ్చారు. వలంటీర్లు ప్రతి ఇంటికీ తిరిగి ఆడుదాం ఆంధ్రాపై అవగాహన కల్పించారు. ఆసక్తి ఉన్న క్రీడాకారుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. జిల్లా వ్యాప్తంగా 19 మండలాలు 512 సచివాలయాల పరిధిలో 1,74,953 మంది క్రీడాకారులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో పురుషులు 1,07,184 మంది కాగా మహిళలు 67,769 మంది ఉన్నారు. వాటిలో క్రికెట్‌కు 66,009 మంది, బాడ్మింటన్‌కు 19,239 మంది, వాలీబాల్‌కు 35,422 మంది, కబడ్డీకి 35,939 మంది, ఖోఖోకు 36,063 మంది నమోదు చేసుకున్నారు.

క్రీడా మైదానాలు సిద్ధం

క్రీడల నిర్వహణకు అవసరమైన క్రీడా మైదానాలు సిద్ధం చేశారు. క్రికెట్‌కు 196 మైదానాలు, బాడ్మింటన్‌కు 307, వాలీబాల్‌కు 335, కబడ్డీకి 330, ఖోఖోకు 322 క్రీడా మైదానాలను ఎంపిక చేశారు.

పోటీలు జరుగుతాయిలా..

- క్రీడా పోటీలు ప్రతి సచివాలయం పరిధిలో నిర్వహిస్తారు. అందుకు మార్గదర్శకాలు రూపొందించారు. వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, ఖోఖో, కబడ్డీ క్రీడా పోటీల్లో ఒక్కో క్రీడకు ఇద్దరు పురుషులు, రెండు మహిళా జట్లు పాల్గొంటాయి.
- సచివాలయం పరిధిలో పోటీలు నిర్వహించాలంటే 228 క్రీడాకారులు ఉండాలి. సచివాలయం పరిధిలో 20 జట్లు పాల్గొంటాయి. సచివాలయ పరిధిలో 5 రోజులు, మండల స్థాయిలో 12 రోజులు, నియోజకవర్గ స్థాయిలో 5 రోజుల పాటు పోటీలు జరుగుతాయి. ఏడు రోజుల పాటు జిల్లా, 5 రోజుల పాటు రాష్ట్ర స్థాయిలో జరుగుతాయి.

నగదు బహుమతులు

నియోజకవర్గ స్థాయి: క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో క్రీడలకు ప్రథమ బహుమతి కింద రూ.35 వేలు, ద్వితీయ బహుమతిగా రూ. 15వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు అందజేస్తారు. బ్యాడ్మింటన్‌లో ప్రథమ బహుమతి రూ.20 వేలు, ద్వితీయ రూ.10 వేలు, తృతీయ బహుమతి రూ.5 వేలు ఇవ్వనున్నారు. జిల్లా స్థాయిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖోకు ప్రథమ బహుమతి రూ. 60 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు. బ్యాడ్మింటన్‌కు మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతిగా రూ.10వేలు అందజేయనున్నారు.

పారదర్శకంగా పోటీలు

గ్రామ సచివాలయ స్థాయిలో పోటీలు పక్కాగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక కమిటీని నియమించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, స్పెషల్ నోడల్ అధికారి జాయింట్ కలెక్టర్ ఉంటారు. గ్రామ స్థాయిలో గ్రేడ్–5 సెక్రటరీ, వీఆర్వో, వెల్ఫేర్ అసిస్టెంట్, డిజిటల్ అసిస్టెంట్, ఇంజినీరింగ్ అసిస్టెంట్, మహిళా పోలీసు, పాఠశాల హెచ్‌ఎం కమిటీలో ఉంటారు. మండల స్థాయిలో ఎంపీడీఓ, పంచాయతీ విస్తరణాధికారి, ఏపీఓ, ఉపాధి హామీ, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వ్యవసాయ శాఖ, ఏఓ, ఇంజినీరింగ్ ఏఈ, సభ్యులుగా ఉంటారు.

15 ఏళ్లు పైబడిన బాలబాలికలు అర్హులు

క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు 15 ఏళ్ల వయసు దాటిన బాల బాలికలకు అవకాశం కల్పించారు. వీరితో పాటు మహిళలు, పురుషులు సైతం పోటీల్లో పాల్గొనే వెసులుబాటు కల్పించారు. మండల స్థాయికి ఎంపికైన క్రీడాకారులకు టీషర్ట్, క్యాప్, రిస్ట్ బ్యాండ్, జిల్లా, రాష్ట్ర స్థాయి విజేతలకు నగదు బహుమతి, ట్రోఫీ, మెడల్ అందజేస్తారు. క్రీడల నిర్వహణకు సీనియర్ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయుల సేవలు వినియోగించుకుంటారు. రాష్ట్ర చరిత్రలోనే తొలి సారిగా క్రీడా స్ఫూర్తిని పెంపొందించే కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారు.

గ్రామీణ క్రీడాకారులకు వరం



గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సాహించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహించడం చాలా గొప్ప విషయం. నేను బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలలో ఆడేందుకు మా గ్రామసచివాలయంలో నమోదు చేసుకున్నాను. క్రీడలలో రాణిస్తే జాతీయ స్థాయి,అంతర్జాతీయస్థాయికి వెళ్లేందుకు ఆడుదాం ఆంధ్రా చక్కని వేదిక.

– తొర్లపాటి ఆశాలత, చంద్రవరం, చాగల్లు మండలం

పోటీల షెడ్యూల్

ఈనెల 26 నుంచి జనవరి 9వ వరకు :	గ్రామ, వార్డు సచివాలయ పరిధి
జనవరి 10 నుంచి 23 వరకు :	మండల స్థాయి
24 నుంచి 30వ తేదీ వరకు :	నియోజకవర్గ స్థాయి
31 నుంచి ఫిబ్రవరి 5 వరకు :	జిల్లా స్థాయి
06 నుంచి 10వ తేదీ వరకు :	రాష్ట్ర స్థాయి

విజయవంతానికి కృషి



క్రీడాకారుల్లో దాగున్న ప్రతిభను వెలికి తీసేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాన్ని అధికారుల సమన్వయంతో విజయవంతం చేస్తాం. పోటీల నిర్వహణకు అవసరమైన అన్ని వసతులు కల్పించాం. క్రీడా సామగ్రిని అందుబాటులో ఉంచాం. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని సీఎం ప్రారంభిస్తే.. జిల్లా స్థాయి కార్యక్రమాన్ని రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో చేపడతాం. క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించాం.

– మాధవీలత, కలెక్టర్

క్రీస్తు బోధనలు అనుసరణీయం

క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న మంత్రి వనిత, ఎంపీ భరత్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హోంమంత్రి వనిత, ఎంపీ భరత్ తదితరులు

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): పాపులను తన రక్తంతో కడిగి రక్షించేందుకు ఏసుక్రీస్తు భూమికి వచ్చారని రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత అన్నారు. ఆదివారం రాత్రి దహించు అగ్ని ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఆమె, ఎంపీ మార్గాని భరత్ రామ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. క్రిస్టమస్ పర్వదిన సందర్భంగా క్యాండిల్ సర్వీస్, కేక్ కటింగ్, న్యూ ఇయర్ క్యాలెండరును వారు ఆవిష్కరించారు. 450 మంది పేదలకు వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఎంపీ భరత్ రామ్ మాట్లాడుతూ క్రైస్తవులకు దీర్ఘకాల సమస్యగా ఉన్న శ్మశాన వాటిక స్థల కేటాయింపు దేవుని కృప వల్ల పరిష్కరించగలిగానన్నారు. ఇది , తనకెంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. రాజమహేంద్రవరం రూరల్ బొమ్మూరు కలెక్టరేట్ వెనుక దాదాపు ఆరెకరాల స్థలాన్ని క్రైస్తవ బరియల్ గ్రౌండ్‌కు సమకూర్చే అవకాశం తన ద్వారా ప్రభువు ఇవ్వడం అదృష్టమన్నారు. బిషప్ థామస్ ముఖ్య అతిథులను దీవించారు. మరింత ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షిస్తూ ప్రార్థించారు. కార్యక్రమంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, వైఎస్సార్ సీపీ ట్రేడ్ యూనియన్ నాయకుడు ఎన్వీ శ్రీనివాస్, వాకచర్ల కృష్ణ, షీలాధామస్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కోటసత్తెమ్మ అమ్మవారి తిరునాళ్లు

- ఘనంగా ఏర్పాట్లు చేసిన దేవస్థానం



విద్యుత్ కాంతులతో దేదీప్యమానంగా కోటసత్తెమ్మ అమ్మవారి ఆలయం

నిడదవోలు రూరల్: నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెంలో కొలువైన కోటసత్తెమ్మ అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా వెలుగొందుతున్నారు. శక్తి స్వరూపిణి అయిన కోటసత్తెమ్మపై భక్తులకు అపారమైన భక్తి. అమ్మవారిని కొలిస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని ప్రగాఢ విశ్వాసం. ప్రతి ఆది, మంగళవారాల్లో అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులను తీర్చుకుంటారు. ఈనెల 26 నుంచి 30వ తేదీ వరకు అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు భారీ ఏర్పాట్లు పూర్తిచేశారు. ఆలయ ప్రాంగణం విద్యుద్దీపాలంకరణ, భారీ సెట్టింగులతో దేదీప్యమానంగా దర్శనమిస్తోంది. మంగళవారం ఉదయం ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ దంపతుల కలశస్థాపనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. లక్ష కుంకుమార్చన చేయనున్నారు.

- రోజూ సహస్రనామపూజలతో పాటు ఉదయం చండీపారాయణం, సాయంత్రం హోమాలు నిర్వహిస్తారు.
- 27న ఉదయం 10 గంటలకు గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి, నిడదవోలు నంగాలమ్మ అమ్మవారి దేవస్థానం ఆధ్వర్యంలో అమ్మవారికి చీర–సారె సమర్పిస్తారు.
- 28న ఉదయం 10 గంటలకు నిడదవోలు ఆర్యవైశ్య వర్తక సంఘం చీర–సారె సమర్పిస్తుంది.
- 29న ఉదయం 10 గంటలకు అఖిల తెలుగుసేన మహిళా అధ్యక్షురాలు ఎల్ ఎన్ ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం నుంచి 101 మంది మహిళలు చీర–సారె, కలశాలు, బోనాలతో అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తారు.
- 30న సాయంత్రం 6 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటుచేశారు.

భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు



తిరునాళ్ల కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశాం. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించడంతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తాం.మహోత్సవాలపై ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు ఇప్పటికే సమీక్ష నిర్వహించారు. పలు సూచనలిచ్చారు. భక్తులంతా అమ్మవారిని దర్శించుకునేలా సౌకర్యాలు కల్పించాం. – బళ్ల నీలకంఠం (శివ), ఈఓ

భయం వద్దు... అయినా అలెర్ట్

- జేఎన్–1 వేరియంట్ పట్ల అప్రమత్తతతో ఉండాలి
- అక్కడక్కడా కోవిడ్ కేసుల నమోదు
- ప్రభుత్వ ఆదేశాలతో యంత్రాంగం అప్రమత్తం
- జిల్లా జీజీహెచ్‌లలో ప్రత్యేక వార్డులు
- ఆర్‌టీపీసీఆర్, ర్యాపిడ్ కిట్లు సిద్ధం
- అందుబాటులో ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్లు



సాక్షిప్రతినిధి, కాకినాడ: కోవిడ్ బలహీనపడినా తానున్నానంటూ వివిధ రూపాల్లో అక్కడక్కడా ఉనికి చాటుకుంటోంది. తాజాగా బయటపడిన కొత్త వేరియంట్ జేఎన్–1తో ఎంత మాత్రం భయపడాల్సిన అవసరం లేదని ప్రపంచ ఆరోగ్య సంస్థతోపాటు ఇక్కడి వైద్యులూ స్పష్టం చేస్తున్నారు. కాకుంటే ముందు జాగ్రత్తలు మాత్రం తీసుకుంటే మంచిదని సూచిస్తున్నారు. రాజమహేంద్రవరం దానవాయిపేటలో మూడు రోజుల క్రితం ఓ పాజిటివ్ కేసు నమోదైంది. సోమవారం 14 మందిని పరీక్షించగా ఇద్దరికి పాజిటివ్ అని తేలింది. కాకినాడ జిల్లా పెద్దాపురం మండలం చినబ్రహ్మదేవం, కాంద్రకోటలో రెండు పాజిటివ్ కేసులు వచ్చాయి. కాంద్రకోట మహిళ కాకినాడ జీజీహెచ్‌లో చికిత్సపొందుతుండగా, చినబ్రహ్మదేవంలో చిన్నారిని వైద్యుల పర్యవేక్షణలో హోం ఐసోలేషన్‌లోనే ఉంచి వైద్యం అందిస్తున్నారు. దాదాపు అన్ని కేసుల్లోనూ పాజిటివ్ అని తేలినా తీవ్రంగా పరిగణించడం లేదు. తాజా కేసుల్లో ఏ వేరియంట్ అనేది నిర్ధారణకు స్వాబ్ నమూనాలను విజయవాడ జినోమ్ సీక్వెన్సింగ్‌కు పంపించారు. నివేదికలు రావడానికి 10 రోజులు పడుతుందని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.



వెంటిలేటర్లు, ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అనుసంధానంతో కాకినాడ జీజీహెచ్‌లో కోవిడ్ వార్డు

ఇన్‌ఫ్లూయంజా వైరస్ బాధితులే ఎక్కువ

జలుబు, దగ్గు వంటి తేలికపాటి అనారోగ్య సమస్యలు కనిపించే సందర్భంలో రక్త పరీక్షలు చేస్తే పాజిటివ్ నమోదవుతుంది. సాధారణ ఫ్లూ లక్షణాలే బాధితుల్లో ఉన్నాయన్న విషయాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ స్పష్టం చేసింది. మరీ అంతగా కంగారుపడనక్కర లేదని పల్మనాలజిస్టులు చెబుతున్నారు. శీతాకాలం కావడంతో ఈనెల రెండో వారం నుంచే వాతావరణం పూర్తిగా చల్లబడిపోయింది. ఇటువంటి తరుణంలో వయస్సుతో నిమిత్తం లేకుండా 30 శాతం మందికి జ్వరం, దగ్గు, జలుబు వంటి లక్షణాలు రావడం సహజం. ఇలాంటి సమస్యలు వస్తే మెడికల్ షాపుల్లో మందులు కొని వాడేయటం సరికాదంటున్నారు వైద్యులు. ఈ సీజనులో జలుబు, దగ్గు, శ్వాసకోశ సమస్యలు తలెత్తే సందర్భంలో ఇన్ ఫ్లూయంజా వైరస్ ఎక్కువ మందికి సోకుతుంది. గతంలో తేలికపాటి జలుబు తదితర ఇబ్బందిని కలిగించిన కరోనా వైరస్–2019 చివరిలో జన్యుపరమైన మార్పులతో మారణహోమాన్ని సృష్టించింది. 2021లో తీవ్ర ప్రాణాంతక డెల్టా వైరస్ విలయాన్ని సృష్టించింది. అనంతరం ఒమిక్రాన్‌గా రూపం మార్చుకుని తేలిక పాటి జ్వరాన్ని మాత్రమే కలుగ చేస్తూ కాలక్రమంలో తగ్గుముఖం పట్టింది.

నాలుగైదు రోజులు తేలిక లక్షణాలు

ఒమిక్రాన్ రకపు బీఏ 2.86 ఉప వేరియంట్‌గా జెఎన్–1ను నిర్ధారించారు. ఇది తేలికపాటి జలుబు తరహా ఇబ్బందిని కలుగజేస్తుందే తప్ప ప్రాణాంతకం కాదని తేల్చడంతో ప్రజలు ఊపిరిపీల్చుకోగలిగారు. తాజా వైరస్‌తో ముక్కు కారడం, గొంతు నొప్పి, దగ్గు, జ్వరం వంటి స్వల్ప లక్షణాలు మాత్రమే ఉంటాయి. ఈ ఇబ్బందులన్నీ నాలుగైదు రోజులకు మాత్రమే పరిమితం అవుతాయి. వయోవృద్ధులు, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు, డయాలసిస్ చేయించుకునే రోగులు, షుగర్, ఆస్మా, కాన్సర్ రోగులకు జేఎన్–1 రకం కరోనా వైరస్ ఇన్ఫెక్షన్ సంక్లిష్టంగా మారే అవకాశం ఉంటుందంటున్నారు. ఈ వర్గాలకు చెందిన వారు తగిన జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుందని వైద్యులు సూచిస్తున్నారు.

ముందస్తు జాగ్రత్తలు

- కాకినాడ, రాజమహేంద్రవరం ప్రభుత్వ బోధనా ఆస్పత్రులు, అమలాపురం ఏరియా ఆస్పత్రిలో ప్రత్యేకంగా వైద్యులతో బృందాలను ఏర్పాటుచేశారు. అవసరాన్ని బట్టి 24/7 పనిచేసేలా వైద్యులు, సిబ్బందిని కేటాయించారు.
- రాజమహేంద్రవరం బోధనా ఆస్పత్రి పల్మనాలజీ విభాగ అధిపతి డాక్టర్ మాతంగి కిరణ్ అటు రాజమహేంద్రవరం, ఇటు కాకినాడ జీజీహెచ్‌లను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.
- ప్రభుత్వ ఆదేశాలతో ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.
- రాజమహేంద్రవరం బోధనాస్పత్రిలో 10 పడకలతో ఐసీయు వార్డు కేటాయించారు. రెండు ఆక్సిజన్ ప్లాంట్లు, 1000 ఎల్‌పీఎల్ పీఎస్‌ఏ ప్లాంట్ కూడా సిద్ధం చేశారు. 110 వెంటిలేటర్లు, 100 పైనే ఆక్సిజన్ సిలెండర్‌లు సిద్ధం చేశారు.
- కాకినాడ జీజీహెచ్‌లో 21 పడకలతో ఈఎన్‌టీ విభాగంలో ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటు చేశారు. ప్రతి పడకకు వెంటిలేటర్ అనుసంధానించారు. కోవిడ్ బాధితుల వైద్యం కోసం 26 ఆక్సిజన్ కాన్సంట్రేటర్లు అందుబాటులో ఉన్నాయి.
- మందుల కొరత లేకుండా చూస్తున్నారు. ఇప్పటికే ఐదుగురు వైద్యుల బృందాన్ని నియమించారు.

భయపడాల్సిన అవసరం లేదు



జేఎన్–1 వేరియంట్ ఇతర ప్రాంతాలకు వ్యాప్తి చెందే అవకాశం లేకపోలేదు. కాకుంటే భయపడాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో పరీక్షల సంఖ్య మరింత పెంచడం ద్వారా వైరస్ ఉనికిని గుర్తించడంతో పాటు వ్యాప్తిని నివారించే అవకాశం ఉంటుంది. గతంలో కోవిడ్ లేదా ఫ్లూ వ్యాక్సిన్‌లు తీసుకున్న వారికి ముప్పు తక్కువ.

– డాక్టర్ మాతంగి కిరణ్, హెచ్ఓడీ, పల్మనాలజీ విభాగం. జీజీహెచ్,రాజమహేంద్రవరం,

ప్రత్యేక వార్డులో అన్ని సిద్ధం చేశాం'



రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో అన్ని ఏర్పాట్లు చేశాం. ప్రత్యేక వార్డులో ఒక కోవిడ్ కేసు మాత్రమే ఉంది. అతను పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు. కేసులు పెరిగితే ఎదుర్కొనేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. రెండు రోజుల పాటు జ్వరం ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలి.

– డాక్టర్ సూర్యప్రభ, సూపరింటెండెంట్, బోధనాసుపత్రి. రాజమహేంద్రవరం.

క్లుప్తంగా

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి

ఆరుగురిపై కేసు



పంట పొలంలో జొన్నకూటి లక్ష్మణ్ మృతదేహం

కొవ్వూరు: మండలంలోని వాడపల్లి గ్రామంలో ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పోలీసులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. తాళ్లపూడి మండలం తిరుగుడుమెట్ట గ్రామానికి చెందిన జొన్నకూటి లక్ష్మణ్ (24) తన తల్లి, నలుగురు సోదరులతో పన్నెండేళ్లుగా చాగల్లు మండలం చంద్రవరంలో నివాసం ఉంటున్నారు. వారం రోజుల కిందట వాడపల్లిలో ఓ అద్దె ఇంట్లోకి వచ్చారు. 24వ తేదీ సాయంత్రం చంద్రవరం వెళ్లి వస్తానని లక్ష్మణ్ ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాకపోవడంతో బంధువులు అంతా వెతికారు. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం చంద్రవరం– వాడపల్లి గ్రామాల మధ్య దమ్ము చేసి ఉన్న పంట పొలంలో లక్ష్మణ్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహానికి సమీపంలోనే మోటారు సైకిల్ ముందు భాగం పూర్తిగా దెబ్బతినడంతో లక్ష్మణ్ మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. లక్ష్మణ్‌ను హత్య చేసి పంట పొలంలో పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. పలువురు కుల సంఘాల నాయకులు సైతం సంఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు అండగా నిలిచారు. చంద్రవరం, వాడపల్లి గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. లక్ష్మణ్ మృతికి మద్దిపాటి శ్రీరామ్మూర్తి, అయ్యప్ప, నిర్మల, వడ్లమూడి ప్రసన్నకుమార్, కుసుకు కృష్ణవంశీ, ద్రోణం మహేష్ కారణమని మృతుడి సోదరుడు కిశోర్ పోలీసులకు ఫిర్యాదు ఇచ్చారు. పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించారు. పైఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వివరించారు.

ధాన్యం లోడుతో గూడ్స్ యార్డు కిటకిట



సామర్లకోట గూడ్స్ యార్డులో రైలు బోగీల నుంచి ధాన్యం లోడింగ్ అవుతున్న వాహనాలు

సామర్లకోట: బీహార్ రాష్ట్రం నుంచి సామర్లకోటకు గూడ్స్ వ్యాగన్ల ద్వారా ధాన్యం లోడ్ రావడంతో సోమవారం రైల్వే గూడ్స్ యార్డు కిటకిటలాడింది. బీహార్ నుంచి పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని రైసు మిల్లుకు మూడు గూడ్స్ రైళ్ల ద్వారా ధాన్యం రావడంతో వాహనాల్లో లోడింగ్‌తో గూడ్స్ యార్డుతో పాటు ఆ ప్రాంతంలోని కాకినాడ రోడ్డు రద్దీగా మారింది. బీహార్ నుంచి 2,660 మెట్రిక్ టన్నుల ధాన్యం సామర్లకోట గూడ్స్ యార్డుకు వచ్చిందని గూడ్స్ యార్డు సూపర్‌వైజర్ సత్యనారాయణ విలేకర్లకు తెలిపారు. ఈ ధాన్యం దిగుమతి ద్వారా రైల్వేకు రూ.55 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. గూడ్స్ యార్డులో సుమారు వంద మంది ఎగుమతి, దిగుమతి కూలీలు పని చేస్తారు. ఈ ధాన్యం లోడింగ్‌తో వారికి చేతినిండా పని దొరికింది.

హరికి దాసులై.. సంస్కృతికి సారథులై

- పల్లెల్లో హరిదాసుల సందడి
- సంక్రాంతిలో వీరి 'పాత్రే' ప్రాధాన్యం



అక్షయపాత్ర, చిడతలు, వీణ



కొత్తపల్లిలో తిరుగుతున్న హరిదాసు

పిఠాపురం: ధనుర్మాసం రానే వచ్చింది.. తెలుగువారి పండగలకు ఆహ్వానం పలికింది.. దీనికి ప్రతీకగా గ్రామాల్లో హరిదాసుల సందడి మొదలైంది.. గలగల గజ్జెల చప్పుడు, అలరించే హరినామ సంకీర్తనలతో గ్రామాలకు సంక్రాంతి శోభ తెచ్చింది.. శిరస్సుపై అక్షయపాత్ర ధరించి ఒక చేత్తో వీణ, మరో చేత్తో చిడతలు వాయిస్తూ హరినామ సంకీర్తనలను ఆలపిస్తూ సంచరించే హరిదాసులు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకలు. వారి గానం వినిపిస్తే చాలు ప్రతి ఇంటి ముందు అతివలు బియ్యం, పండ్లు, పూలతో వేచి ఉంటారు. హరిదాసు వస్తే శిరస్సుపై ధరించిన అక్షయపాత్రలో ఆ బియ్యం వేసి సాక్షాత్తు ఆ నారాయణుడే తమ ఇంటికి వచ్చినట్లు భావించి చేతులు జోడించి నమస్కరిస్తారు. ఇదంతా ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతి గ్రామంలో 33 రోజుల పాటు కొనసాగుతుంది. సంస్కృతీ సంప్రదాయాలను ఇనుమడింపజేసే వారి వెనుక పడే కష్టం పరిశీలిస్తే ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. కేవలం 33 రోజులు ఇలా హరిదాసులుగా తిరిగే వీరు మిగిలిన 11 నెలల పాటు సామాన్యుల్లా కాయకష్టం చేసి కడుపు నింపుకొంటారు. మోయలేని భారమైనా తరతరాల నుంచి వస్తున్న సంప్రదాయాలను కొనసాగించాలనే పట్టుదలే వీరిని హరిదాసులుగా కొనసాగిస్తుందనడంలో సందేహం లేదు. దీక్షా.. పట్టుదలే వీరికి ఆయుధాలు. అలుపెరుగని కాలినడకే వీరి దైనందిన జీవితం. కాకినాడ జిల్లాలో సుమారు 250 మంది విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాల నుంచి వచ్చిన హరిదాసులు గ్రామాల్లో తిరుగుతున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అక్కడి వారే హరిదాసులుగా కొనసాగుతున్నారు. వీరు సాగే పయనంలో ఆకలి దప్పికలు వారికి అసలు గుర్తుకురావు. ఎవరేమనుకున్నా వారి హరి నామ సంకీర్తన ఆగదు.

అక్షయ పాత్రదే ప్రథమ స్థానం

కలశం లేదా అక్షయపాత్రగా పిలిచే ఆ పాత్రకు ప్రజలు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఈ పాత్రలో భిక్ష వేయడం ద్వారా నారాయణుడికి నైవేద్యం సమర్పించినట్లు భక్తులు భావిస్తారు. అదీ ధనుర్మాసంలో హరికి కొత్తగా పండిన ధాన్యాలు సమర్పించడం ద్వారా పాడి పంటలు అభివృద్ధి చెందాలని భక్తులు కోరుకుంటారు. ఈ అక్షయపాత్ర హరిదాసు శిరస్సుపై ఉన్నంత సేపు కాలకృత్యాలు తీర్చుకోవడం గాని, అన్న పానీయాలు తీసుకోవడం గాని, కనీసం వేరొకరితో మాట్లాడడం గాని చేయడం నిషేధం. అకుంఠిత దీక్షతో సాక్షాత్తూ ఆ నారాయణుడే గ్రామాల్లో తిరుగుతున్నాడనిపించేలా పవిత్రంగా తిరగాల్సి ఉంటుంది. అలాగే ఆ పాత్ర శిరస్సుపై ఉన్నంత సేపు పాదరక్షలు కూడా వేసుకోకుండా ఎక్కడా ఆగకుండా (భిక్ష వేసేటప్పుడు తప్ప) గ్రామ సంచారం కొనసాగించాలి. ఎక్కడైనా అక్షయపాత్ర నిండితే ఆ ప్రాంతంలోని ఒకచోట దానిలో భిక్షను భద్రపరిచి తిరిగి సంకీర్తనను ప్రారంభిస్తారు. పాత్ర ధరించే ముందు తలస్నానం చేసి హరిదాసు వేషధారణలో భాగంగా పంచె, కండువా ధరించి పూలతో అలంకరించిన అక్షయపాత్రను శిరస్సున పెట్టుకుని బయలు దేరుతారు. ఉదయం నుంచి ఉపవాసం ఉండి గ్రామ సంచారం పూర్తయ్యాక అల్పాహారం తీసుకుని సాయంత్రం భోజనం చేసి పాలు తీసుకుంటారు. హరిదాసులు మాంసాహారానికి దూరంగా ఉంటారు.

తాతల కాలం నుంచి వారసత్వంగా..



నేను 35 ఏళ్లుగా హరిదాసుగా గ్రామాల్లో తిరుగుతున్నా. ఇది తాతల కాలం నుంచి వారసత్వంగా వస్తోంది. శ్రీమద్రమరమణ గోవిందా హరి అనే హరి నామమే మాకు ప్రాణం. విష్ణుమూర్తి స్వరూపమైన హరికి దాసులుగా కొనసాగడం వల్లే మేము హరిదాసులుగా పేరొందాం. హరికి ప్రీతిపాత్రమైన ధనుర్మాసం, మాఘమాసంలో హరినామ సంకీర్తనలను గ్రామాల్లో ప్రసరింపజేస్తున్నాం. ప్రతి రోజూ ఉదయం నాలుగు గంటల నుంచి మా సంకీర్తన ప్రారంభమవుతుంది. రోజుకు సుమారు 20 నుంచి 25 కిలోమీటర్లు తిరుగుతాం. ఇలా 33 రోజులు హరికి దాసులుగానే జీవిస్తాం. గ్రామాల్లో కొంత మార్పు వచ్చినా ఆదరణ బాగుంది. కాకినాడ జిల్లాలో సుమారు 250 మంది వరకూ తిరుగుతున్నాం. పిఠాపురం నియోజకవర్గంలో 12 మంది ఇంటింటికీ వెళ్తున్నాం.

–చల్లా చక్రపాణి, గరివిడి గ్రామం, విజయనగరం జిల్లా

క్రిస్మస్ సంబరం.. తేజోమయం



కరప మండలంలో జరిగిన క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతున్న కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు



రామచంద్రపురంలో కేక్ కట్ చేసి క్రైస్తవులకు తినిపిస్తున్న మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



తుని ఎస్‌ఎంబీ చర్చిలో కేక్ కట్ చేస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో వేడుకలు
- క్రైస్తవులతో కిటకిటలాడిన చర్చిలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం క్రిస్మస్ పర్వదినాన్ని వేడుకగా జరుపుకొన్నారు. ఆ కరుణామయుని పుట్టినరోజు వేడుకల్లో క్రీస్తు ఆరాధకులు పాల్గొని దైవ ఆశీర్వాదం పొందారు. క్యాండిల్ సర్వీస్‌లో కొవ్వొత్తులు వెలిగించి క్రీస్తును ఆరాధించారు. చర్చిల్లో క్రీస్తు జననాన్ని వివరిస్తూ నాటకాలు ప్రదర్శించారు. ఉమ్మడి జిల్లాలో 5 వేల వరకూ పెద్ద చర్చిలు, 10 వేల వరకూ చిన్న చర్చిల్లో ఈ వేడుకలు జరిగాయి. లూథరన్, బాప్టిస్టు, రోమన్ కేథలిక్, మన్నా మిషన్, బైబిల్ మిషన్, బెయెర్షబా, యేసు ప్రేమాలయం తదితర శాఖల ఆధ్వర్యంలో వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. రోమన్ కేథలిక్ శాఖ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఆదివారం రాత్రి నుంచే ప్రారంభం అయ్యాయి. రాత్రంతా వీరు చర్చిలోనే గడుపుతూ ప్రత్యేక గీతాలను ఆలపించారు. తాళ్లరేవు ఆంధ్రా బాప్టిస్టు చర్చి, కాకినాలోని జగన్నాథపురం చర్చిస్కేర్ సెంటర్‌లోని ఆంధ్రా బాప్టిస్టు, రోమన్ కేథలిక్, హౌస్ ఆఫ్ ప్రేయర్, క్రేగ్ మెమోరియల్ చర్చి, రిజర్వు పోలీస్ యూనియన్ బాప్టిస్టు చర్చి, ఏపీఎస్‌పీ యూనియన్ బాప్టిస్టు చర్చి, రామారావుపేట లూథరన్ చర్చి, పిఠాపురం సెంటినరీ బాప్టిస్టు చర్చి, తుని ఆంధ్రా బాప్టిస్టు చర్చి, నాసా చర్చి, పెద్దాపురం లూథరన్ చర్చి, బైబిల్ మిషన్, బాప్టిస్టు చర్చిల్లో క్రైస్తవులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రార్థనలు చేశారు. తుని స్కాట్ బాప్టిస్టు చర్చిలో జరిగిన వేడుకల్లో మంత్రి దాడిశెట్టి రాజా పాల్గొని క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కాకినాడలో జరిగిన వేడుకల్లో కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, కురసాల కన్నబాబు, ఎస్పీ సతీష్‌లు పాల్గొని క్రిస్మస్ కేక్‌లను కట్ చేశారు. రామచంద్రపురంలో కేక్ కట్ చేసి క్రైస్తవులకు మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ గౌరవ అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ జి.జోసఫ్‌బెన్ని, అధ్యక్షుడు డీజీ శామ్యూల్ సాగర్, సాధారణ కార్యదర్శి శీరం ఐజాక్, ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి శామ్యూల్ విక్టర్, ఉపాధ్యక్షుడు మడికి జోయల్ రాజు, కోశాధికారి పి.సురేంద్రకుమార్, కోనసీమ జిల్లాలో పాస్టర్ దానియేల్ , రైమోజోహనీ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.

ప్రత్యేక ఆరాధనలు

క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని చర్చిల్లో ఉదయం 9.30 నుంచి 12.30 వరకూ ప్రత్యేక ఆరాధనలు జరిగాయి. ప్రత్యేక అతిథులు క్రిస్మస్ సందేశాన్ని అందించారు. క్రీస్తు ఆరాధిస్తూ గీతాలను ప్రత్యేకంగా ఆలపించి, కేక్ కట్ చేశారు. ఒకరికొకరు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. పేదలకు వస్త్రాలు పంచిపెట్టి సేవాగుణం చాటారు.

రేపు నిధి ఆప్‌కే నిఖత్ కార్యక్రమం

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం ఈపీఎఫ్‌ఓ ప్రాంతీయ కార్యాలయం పరిధిలో ఈ నెల 27న నిధి ఆప్‌కే నిఖత్–డిస్ట్రిక్ట్ ఔట్‌రీచ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ పీఎఫ్ కమిషనర్ వైడీ శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లాలో జీఎస్ఎల్ ఎడ్యుకేషనల్ సొసైటీ, లక్ష్మీపురం, రాజానగరం, కోలమూరు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ముమ్మిడివరం శ్రీనివాస కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్, కాకినాడ జిల్లాలో అన్నవరం శ్రీవీరవెంకట సత్యనారాయణస్వామి దేవస్థానం ఆవరణలో, ఏలూరు జిల్లాలో ఏలూరు వట్లూరు రామచంద్ర కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో, పశ్చిమగోదావరి జిల్లాలోని పాలకొల్లు నాగరాజుపేట గురుకుల విద్యాలయంలో, అల్లూరి సీతారామరాజు జిల్లా వై.రామవరం మండలం పి.ఎర్రగొండ ఈఎంఆర్ స్కూల్‌లో, గంగవరం మండలం గంగవరం మండలం నెల్లిపూడి కొత్తాడ గ్రామం కేజీబీవీ స్కూల్‌లో, మారేడుమిల్లి మండలం మారేడుమిల్లి పంచాయతీలో డిస్ట్రిక్ట్ ఔట్ రీచ్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈసీఆర్, ఇతర రిటర్న్‌లు, కేవైసీ సీడింగ్, సభ్యులు వివరాల దిద్దుబాటు/నవీకరణ, ప్రధాన యజమానులు, కాంట్రాక్టర్లు, యూఏఎన్ ఉత్పత్తి, క్రియాశీలత గురించి సంప్రదించవచ్చన్నారు. పీఎఫ్ సభ్యులు, పింఛనుదారులు, ఎస్టాబ్లిష్మెంట్‌లు, కొత్తగా కవర్ చేసిన ఎస్టాబ్లిష్మెంట్‌లు ఈ అవుట్ రీచ్ ప్రోగ్రామ్‌ను ఉపయోగించుకోవాలన్నారు. డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ బకాయి పింఛనుదారులు, డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ సమర్పించడానికి ఈ క్యాంపును సందర్శించవచ్చన్నారు.

ట్రస్టు బోర్డు చైర్మన్ 'మట్టపల్లి' కన్నుమూత



మట్టపల్లి రమేష్‌బాబు (ఫైల్)

సామర్లకోట: పంచారామ క్షేత్రమైన బాలా త్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ మట్టపల్లి రమేష్‌బాబు(72) సోమవారం కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న రమేష్‌బాబు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో, వారం రోజులుగా అచ్చంపేట ఏడీబీ రోడ్డులోని మెడికేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మరణించారు. మూడు పర్యాయాలు ట్రస్టు బోర్డు చైర్మన్‌గా, మున్సిపల్ కౌన్సిలర్‌గా పని చేశారు. పంచారామ క్షేత్ర ఆలయ అభివృద్ధికి విశేష కృషి చేశారు. ఆయన మృతికి రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, ఆలయ ఈఓ డి.నాగమల్లేశ్వరరావు, ఆలయ పండితులు, ట్రస్టు బోర్డు సభ్యులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ, వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, అధికార పక్ష కౌన్సిలర్లు, నాయకులు సంతాపం తెలిపారు.

గుర్తు తెలియని మహిళ మృతి

కాకినాడ రూరల్: కాకినాడ నుంచి సామర్లకోట వెళ్లే మార్గంలో ఇంద్రపాలెం ఐడియల్ కాలేజీ ఎదురుగా ఉన్న కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. దీనిపై ఇంద్రపాలెం పోలీసుల కథనం ప్రకారం.. అక్కడ కాలువ మెట్ల వద్ద సుమారు 50 ఏళ్ల మహిళ మృతదేహం ఉంది. కాలువ పైనుంచి మృతదేహం కొట్టుకురావడం కాని, మెట్లపై నుంచి జారిపడి మృతిచెందడం గాని జరిగి ఉండొచ్చని పోలీసులు తెలిపారు. ఈ మేరకు అడిషనల్ ఎస్సై లక్ష్మణ్‌స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో మహిళ మృతదేహం

కడియం: వేమగిరి గట్టు వద్ద పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహాన్ని కడియం పోలీసులు గుర్తించారు. సోమవారం ఉదయం వేమగిరి గట్టుపై అంబేడ్కర్ విగ్రహం వెనుక పంట కాలువలో మహిళ మృతదేహం ఉంది. ఆమె వయసు 45 నుంచి 55 ఏళ్ల మధ్య ఉంటుందని, 5 అడుగుల ఎత్తు, పసుపు రంగు జాకెట్, ఎరుపు, పసుపుపచ్చ డిజైన్ కలిగిన చీర ధరించి ఉన్నట్లు వీఆర్వో రెడ్డి వీరవెంకటలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం

- పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- వైఎస్సార్ సీపీలో భారీ చేరికలు



బొల్లెద్దుపాలెంలో వైఎస్సార్ సీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి (కోరుకొండ): వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ధీమా వ్యక్తం చేశారు. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన 90 మంది వైఎస్సార్ సీపీలో చేరారు. ఈ కార్యక్రమం సర్పంచ్ కురుమెళ్ల వెంకట రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, నాయకులు మంగం రాంబాబు, డేగల బాబులు ఆధ్వర్యంలో జరిగింది. పార్టీలో చేరిన వారికి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలతో పేదల జీవితాలకు వెలుగు వచ్చిందన్నారు. పల్లెల ప్రగతికి ప్రభుత్వం రూ.కోట్ల నిధులు కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దపీట వేస్తుందని తెలిపారు. నవరత్న పథకాల ద్వారా బడుగు, బలహీన వర్గాలకు మేలు జరుగుతుందన్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు అండ్ కో ముందుకు వస్తుందని విమర్శించారు. వారిని నమ్మేస్థితిలో ప్రజలు లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేనలకు పరాభవం తప్పదని అన్నారు. 2024 ఎన్నికల్లో తిరిగి జగనన్న సీఎం కావడం ఖాయమని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యుడు కర్రి నాగేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ నక్కా రాంబాబు, పార్టీ మండల కన్వీనర్ అడపా కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆ దారం.. అత్యంత ప్రమాదం

గాలిపటాల తయారీలో జాగ్రత్త అవసరం



నిషేధించిన చైనాకు చెందిన మాంజా దారం



పిఠాపురంలో అమ్మకానికి సిద్ధం చేసిన గాలిపటాలు

పిఠాపురం: సంక్రాంతి వస్తుందంటే చాలు ఆకాశంలో రంగు రంగుల పతంగులు ఎగురుతుంటాయి. పిల్లలు కాగితాలతో తయారు చేసిన గాలి పటాలను ఎగురవేయడానికి ఆసక్తి చూపుతుంటారు. ఇప్పటి వరకూ గాలిపటాలకు నూలు దారం వాడేవారు. కానీ మార్కెట్‌లోకి చైనాకు సంబంధించి మాంజా దారం అందుబాటులోకి రావడంతో దానినే వినియోగిస్తున్నారు. కాటన్ దారం తెగిపోతుందని, మాంజా దారం తెగకుండా ఉంటుందని మక్కువ చూపుతున్నారు. ఈ మాంజా (గాజు ముక్కలు, ప్లాస్టిక్‌తో తయారు చేసిన) తాడును వాడొద్దని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు. దీని వాడడంతో ప్రాణాల మీదకు వస్తుండడం, పక్షులకు హాని కలుగుతుండడం, పిల్లలు గాయాల పాలవుతుండడంతో నిషేధించారు. వీటి వాడకం ప్రమాదకరమని సూచిస్తున్నారు.